# తన దాకా వస్తే

-కోపూరి పుష్పాదేవి

ఇన్నాళ్ళూ తను ఎంతో ఆత్రంగా ఎదురు చూసిన శుభ ఘటియ రానే వచ్చింది.

తన దాస్య శృంఖలాలు తెగిపోయాయి.

ముళ్ళ కిరీటం తన శిరస్సు నుండి తొలగించ బడింది.

తనను బంధించిన పంజరం రెక్కలు విడి పోయాయి.

తనిప్పుడు స్వేచ్ఛా జీవి. తనకిప్పుడు పూర్తి స్వాతంత్ర్యం లభించింది.

"అబ్బ...! ఇప్పుడు ఎంత ఆనందంగా ఉందో...!"

ఆ ఆనందం పట్టలేక, ఆమెకు ఏడుపు వచ్చింది.

ఆమెను భర్త మనోహర్ ఉక్కు పిడికిలి నుండి విడుదల చేస్తూ, కోర్టు విడాకులు మంజూరు చేసింది.

అంత ఆనందంలోనూ కుముదినికి ఏదో చెప్పలేని భయం కలుగసాగింది. ఇప్పుడు తను. తన మూడేళ్ళ కూతురు తప్ప, ఎవరూ లేని ఏకాకి.

"అతను దుష్టుడైనా, దుర్మార్గుడైనా ఇన్నాళ్ళూ ఈ కపట లోకం నుండి అతని రక్షణ తనకు లభించేది. కానీ, ఇప్పుడు తోడేళ్ళు. గుంట నక్కల వంటి కొందరు మనుష్యుల బారి నుండి తనను తనే రక్షించుకోవాలి. తనకిప్పుడు ఆర్థికంగానూ, సామాజికంగానూ ఎటు వంటి అండా లేదు. మనోహర్ జీతం నుండి కొంత భాగం కోర్టు ద్వారా తనకు వచ్చే అవకాశమున్నా. తనే వద్దనుకున్నది. ఆ కుటిలుడి సొమ్ము తినటం ఇష్టం లేక. ఇక ఈ పరాయి రాష్ట్రంలో, పరాయి మనుష్యుల మధ్య తను ఒంటరిగా బ్రతకలేదు."

"అందుకే తన స్నేహితురాలు కస్తూరి చెప్పినట్లు, ఆంధ్రాకే వెళ్ళిపోయి, ఆమె నిర్వహించే కాన్వెంట్లో పనిచేస్తే, తనకు గడవకపోదు, తన కూతురిని ఎలాగోలా పెంచుకోక పోలేదు."

ఆంధ్రాని తలచుకోగానే, ఆమెకు తన పుట్టింటి వారూ, తన బాల్యం అంతా గుర్తుకు వచ్చింది.

గోవిందరావూ, సుందరమ్మలకు ఇద్దరే సంతానం. అబ్బాయి రవి, అమ్మాయి కుముదిని, గోవిందరావు చాలా మంచివాడు. నిదానస్థుడు. మెత్తని మనిషి. కనీసం సిగరెట్ వంటి దురలవాటు కూడా లేదు అతనికి. తండ్రి ఇచ్చిన ఆస్థి ఉన్నది. చేస్తున్న ఉద్యోగం కూడా ఫరవాలేదు. ఇన్ని ఉన్నా, ఆయనకు మనశ్శాంతి ఒకటే కరువు. కారణం భార్య సుందరమ్మ అతనికి పూర్తి వ్యతికరేం. ఆమె ఎంత గయ్యాళిదీ అంటే, ఆమె అంటే వీధి మొత్తానికీ హడల్. ప్రతిరోజూ ఎవరో ఒకరితో, ఏదో వంకన గొడవ పడనిదే ఆమెకు తోచదు. రవిది తండ్రి పోలిక. కుముదినికి తల్లి పోలిక.

గోవిందరావుకి ఇలాంటివన్నీ నచ్చవు. అయినా, చెప్తే వినే రకం కాదు సుందరమ్మ. ఆఖరుకు తన చెల్లెళ్ళతో కూడా ఆమె ఘోరంగా దెబ్బలాడుతుంటే, ఆయన సహించలేకపోయేవాడు. అతని తల్లిదండ్రులు పోయి చాలా కాలమయింది. ఇద్దరు చెల్లెళ్ళు. వాళ్ళకి ఈ ఒక్కగానొక్క అన్న మీద అభిమానం, ఆశ ఉండ టంలో తప్పు లేదు కదా.

పెద్ద చెల్లెలు జానకి. ఇద్దరు పిల్లల తల్లి. ఆమె భర్త పల్లెలో వ్యవసాయం చేస్తాడు. పేద సంసారం వాళ్ళది. ఒకరోజు యాక్సిడెంట్లో జానకి భర్త కాలు విరిగిపోయింది. పట్టణం వచ్చి, అన్న గారింట్లో ఉండి భర్తకు వైద్యం చేయిద్దామనుకున్నది ఆమె. అతణ్ణి నెల రోజులు హాస్పిటల్లో ఉంచాలని చెప్పారు డాక్టర్లు.

ఈ విషయం విన్న సుందరమ్మ మండి పడింది. ఇదేం ఇల్లా. ధర్మ సత్రమా...? నెలల తరబడి ఈ అలగా జనాన్ని పోషించటానికి, మేమేం లక్షాధి కారులమా... అంటూ రుసరుసలాడింది. పిల్లి మీద పెట్టీ, ఎలుక మీద పెట్టీ జానకిని సాధించి పోయ సాగింది.

అన్న గారి ముఖం చూసి ఆమె కొంత ఓర్చుకున్నా, ఇక భరించే ఓపిక లేక సూత్రం తాడు అమ్మేసి, ఆ డబ్బుతో కొన్ని సామాన్లు కొనుక్కుని, ఆస్పత్రి దగ్గరగా చిన్న గది అద్దెకు తీసుకుని వెళ్ళిపోయింది.

అప్పుడు గానీ, శాంతించలేదు సుందరమ్మ. అప్పటికి కుముదినికి పదహారేళ్ళుంటాయి. చిన్న పిల్లేమీ కాదు. సీనియర్ ఇంటర్ చదువుతోంది. తల్లికి మంచీ చెడూ చెప్పవలసింది పోయి, ఆమెకు వంత పాడేది. మనిషి చూస్తే కుందనపు బొమ్మ. మనసు మాత్రం సంకుచితం.

ఇక, రెండో ఆడబడుచు సుశీల విషయంలో సుందరమ్మ మరీ ఘోరంగా ప్రవర్తించింది. భర్తా, కొడుకూ, జానకీ ఎంతమంది వద్దని వారిస్తున్నా వినక. కొద్ది కట్నంలో పోతుందని సుశీలను ఒక రోగిష్టి వాడికిచ్చి కట్టబెట్టింది.

ఇటు భార్యకు చెప్పలేక అటు చెల్లెలి దురవస్థ చూడలేక, మనోవ్యాధితో మంచం పట్టాడు గోవింద రావు. కొన్నాళ్ళకే మరణం అతణ్ణి అన్ని బాధల నుండి విముక్తి చేసింది.

అయినా, సుందరమ్మ మారలేదు.

☆☆☆

కుముదిని క్లాస్‌మేట్ విష్ణువందన. పేద ఇంటి అమ్మాయి అందమూ, అణకువా, తెలివితేటలూ ఆమె సొత్తు. ఎప్పుడూ క్లాసులో ఫస్టు వచ్చేది. అందరూ ఆమెను మెచ్చుకుంటుంటే, కుముదిని మాత్రం అసూయతో ఉడికిపోయేది. అకారణంగా ఆమె పట్ల ద్వేషం పెంచుకున్నది.

తల్లీ, చెల్లెలూ వద్దని చెప్పినా, వినక విష్ణు వందనను కట్నం లేకుండా పెళ్ళాడేడు రవి. సుంద రమ్మా, కుముదినీ అగ్గిమీద గుగ్గిలమయ్యారు. "నా ఇష్టం లేకుండా ఈ పిల్ల నా కొడుకుతో కాపురం ఎలా చేస్తుందో చూస్తానని" శపథం పట్టింది సుందరమ్మ. పాపం, ఆమెకు ఆ శపథం నెరవేర్చుకునే అవకాశం రాలేదు. బిపి, షుగర్ బాగా పెరిగిపోయి, పెరాలసిస్ వచ్చి, కాలూ, చెయ్యీ, నోరూ పడి పోయాయి. ఇప్పుడు ఆమెకు ఆ కోడలే ఆధారం.

☆☆☆

మనోహర్, తన పేరంత మనోహరమైన వాడు. కుముదిని అతణ్ణి ప్రేమించింది. పెళ్ళంటూ చేసు కుంటే, అతణ్ణే చేసుకుంటానని పట్టుబట్టింది.

"వద్దమ్మా..., అతడు మంచి వాడు కాదు. నాకు అతణ్ణి గురించి చాలా మంది చెప్పారు. నీకు మంచి సంబంధం చూసి పెళ్ళి చేస్తాను. ముందు డిగ్రీ పూర్తి కానివ్వు. తొందరపడకు..." అని రవి ఎంతో నచ్చ చెప్పాడు.

కానీ, కుముదిని విన్పించుకోలేదు. "ఈ కాలంలో చిన్న చిన్న సరదాలు ఉంటే తప్పేం కాదు. పెళ్ళి అయితే, అతనే మానేస్తాడు. నువ్వు నీకు ఇష్టమైన అమ్మాయిని చేసుకోలా.. అలాగే నేనూ చేసుకుంటాను" అంటూ మొండితనం చేసింది. అచ్చమైన తల్లి పోలిక మరి.

ఇక చేసేది లేక, రెండు లక్షలు కట్నం ఇచ్చి, ఘనంగా వివాహం చేశాడు రవి.

ఉద్యోగరీత్యా భర్తతో భోపాల్ వచ్చేసింది కుము దిని. ఆతర్వాత, అన్నా వదినల మీద కోపంతో ఒక్కసారి కూడా పుట్టింటికి వెళ్ళలేదు. ఆఖరుకు పాప డెలివరీకి కూడా పోలేదు. వారినీ రమ్మనమని అడగ లేదు.

పండుగలకు, పబ్బాలకు రమ్మనమని అన్నగారు ఆప్యాయంగా పిలిచినా, ఏమైనా కొనుక్కోమని వేలకు వేలు డబ్బు పంపినా, డబ్బు తీసుకుని ఊరుకునేది.

ఒకప్పుడు సరదాలని సర్దిచెప్పుకున్న మనోహర్ అలవాట్లు ఇప్పుడు శృతిమించి రాగాన పడ్డాయి. త్రాగుడు, పేక, గుర్రప్పందాలూ, లాటరీలు, చివరికి అమ్మాయిలను సరాసరి ఇంటికి తీసుకువచ్చేంత వరకు అతను ఎదిగిపోయాడు. అతనికి భార్య మీద ప్రేమాను రాగాలు లేవు సరికదా, కనీసం కన్న కూతురిపై ఆప్యాయత, అభిమానం కూడా చూపించడు. అందంగా, రబ్బరు బొమ్మలా, ముద్దొచ్చేలా ఉన్నదని ఇరుగుపొరుగు ఎత్తుకుని, దించనటువంటి ఆ పసి దాన్ని, అతను ఒక్కనాడన్నా దగ్గరకు తీసి ఎరుగడు. కట్నం రెండు లక్షలూ, మెడలోని నగలూ అన్నీ అయిపోయాయి.

అలవాట్లు మానుకొనమని కుముదిని నయాన భయాన ఎంత చెప్పినా, అతను వినలేదు. ఇంకా ఆమె ఎదురు తిరిగితే, గొడ్డును బాదినట్లు బాదేవాడు.

తన కాపురంలోని కడగండ్లన్నీ ఊరిలోని తన

## కోపం

గాలి తండ్రి
చెట్టు తల్లికి ప్రేమగా
తల దువ్వడమే కాదు
కోపం వస్తే అప్పుడప్పుడు
కొమ్మలను విరిచేస్తాడు
ఇంకా అధికమైతే
కూకటి వేళ్లతో
పెకలించి పడేస్తాడు
పురుషుడనన్న
అహంభావమేమో

—సింగిడి రామారావు

స్నేహితురాలు కస్తూరికి చెప్పుకునేది కుముదిని. ఎవరైనా, నాలుగు ఓదార్పు మాటలు చెప్పగలరే కానీ. ఆమె కష్టాలు ఒకరు ఆర్చేవీ, తీర్చేవీ కాదు. అలాగే రెండు మూడేళ్ళు గడిచాయి. మనోహర్‌లో ఏమాత్రం మార్పు రాలేదు. పైపెచ్చు, అతను తన్ను తాను తాకట్టు పెట్టుకున్నా తీరనన్ని అప్పులు చేశాడు. ఇంట్లోకి బియ్యం, పప్పులు, ఉప్పులు తేవడం కూడా మానేశాడు.

అన్నయ్య, వదిన ఎంత చెప్పినా వినక, తన శ్రేయస్సు కోరే వారి మాటలను లక్ష్యపెట్టక, మూర్ఖించి, తను మనోహర్‌ను చేసుకున్నందుకు తనకు తగిన శాస్తే జరిగిందని కుమిలిపోయేది కుముదిని. పాపం ఆమె బాధలన్నీ చూసిన, పొరుగింటి లాయర్ ఆమెకు విడాకులు తీసుకొమ్మని సలహా చెప్పారు. ఆయన కూడా ఆంధ్రుడు. ఆయన సహాయంతో విడాకులు లభించాయి కుముదినికి.

ఇంత జరిగినా, ఒక్క విషయమూ అన్నకు తెలియ చేయలేదు కుముదిని.

"ఇప్పుడు తను విజయవాడకు వెళ్ళి ఎవరింట్లో ఉండాలి...? తండ్రి లేకపోయినా, చాలాకట్నం ఇచ్చి, ఘనంగా పెళ్ళి జరిపిన అన్నా వదినలను తను దేనికీ పనికిరాని వాళ్ళుగా తీసిపారేసింది. ఇక్కడకు వచ్చాక, తిరిగి ఒక్కసారైనా వాళ్ళ ముఖం చూడక, కష్టం సుఖం చెప్పుకోక వాళ్ళను దూరం చేసుకుంది. తల్లిని కూడా మరిచిపోయింది. అటువంటి తను, ఏ ముఖం పెట్టుకుని వాళ్ళ ఇంటికి వెళ్ళగలదు...? ఒకవేళ వెళ్ళినా, వాళ్ళు తనని ఆదరిస్తారని నమ్మకమేమిటి?"

"ఒకప్పుడు కష్టాల్లో ఉండి, మేనత్త తమ ఇంటికి వస్తే, అమ్మా, నేనూ ఆమెను ఆదరించామా...? చిన్న మేనత్త విషయంలో మరీ ఘోరంగా ప్రవర్తించామే..."

"తల్లికి లేకపోయినా, కనీసం తనకైనా మేనత్తల మీద అభిమానం, అనురాగం ఉండవలసింది. అటువంటిది, తను కూడా వాళ్ళ పట్ల క్రూరంగా ప్రవర్తించింది. వాళ్ళను చీడాకు పురుగుల్లా తీసి పారేసింది..."

"తనకీ శాస్తి తప్పక జరుగవలసిందే. నేను, నా కూతురితో విడిగా ఉంటాను. అన్నయ్య గారి ఇంటికి వెళ్ళను..." అనుకుంటూ ఆమాటే కస్తూరికి చెప్పింది "తనకొక చిన్న గది చూసి పెట్టమని."

☆☆☆

కూతురితో ట్రైన్ దిగిన కుముదిని స్టేషన్‌కు వచ్చిన అన్నా వదినలను చూసి ఆశ్చర్యపోయింది.

"ఏమ్మా మేము ఒకళ్ళం ఉన్నామన్న సంగతి మర్చిపోయావా, ఇల్లు చూడమని కస్తూరికి చెప్పావట..." అంటూ వదిన ఆప్యాయంగా అడుగుతుంటే. "వదినా..." అంటూ బావురుమని ఏడుస్తూ, ఆమె మీద వాలిపోయింది కుముదిని, అది స్టేషన్ అన్న సంగతి కూడా మరిచిపోయి.

"ఊరుకో, ఊరుకో, నీకు మేము లేమూ. నిన్ను ఒంటరిగా వదిలేస్తామా..." అభిమానంగా అంటున్న అన్న పాదాలకు నమస్కరించాలనిపించింది కుముదినికి. ■

## సూడో

-బులుసు-జీ-ప్రకాష్

ఒక రాజకీయ నాయకుడు అమెరికాకి వ్యతిరేకంగా ప్రసంగం చేస్తున్నాడు. "సోదర సోదరీమణులారా! అమెరికాని మించిన టెర్రరిస్టు దేశం ప్రపంచం మొత్తం మీద లేదు. తనే ఒక పెద్ద సూపర్ పోలీసు ననుకుంటోంది. చిన్న చిన్న దేశాల్ని భయపెట్టి తన అధీనంలోకి తెచ్చుకుంటోంది. తన చెప్పుచేతల్లో లేని ప్రజాస్వామ్య దేశాన్ని కూలగొట్టి నియంతలకి పట్టం కడుతోంది. ప్రపంచీకరణ పేరుతో మార్కెట్ ఎకానమీ పేరుతో తన గుత్తాధిపత్యాన్ని నిలుపుకుందామని ప్రయత్నిస్తోంది!" అని తన ప్రసంగం ముగించేసరికి మొబైల్ ఫోన్ మోగింది.

"హలో! ఎవరు?"

"నేన్నాన్నా! నీ లెనిన్‌ని. న్యూజెర్సీ నించి మాట్లాడుతున్నాను."

"నాన్న! నువ్వా! కులాసాగా ఉన్నావా?"

"ఆ కులాసానే! మీరెలా వున్నారు? అమ్మా, చెల్లాయి బావున్నారా?"

"ఆ బావున్నారు. మీరేమైనా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారా? ఏమైనా డాలర్లు పంపమంటారా?"

"ఆ ఆ! ఓ వెయ్యి డాలర్లు పంపు. అమెరికాని విమర్శించే మీటింగులకి డబ్బు చాలడం లేదు."

"ఆ అలాగే! రేపే పంపిస్తున్నాను."

"తరువాత మరో ముఖ్య విషయం. ఇక్కడ మత మౌఢ్యం చాలా ఎక్కువగా వుంది. ఆ మౌఢ్యాన్ని ఖండిస్తూ కూడా ఉపన్యాసాలు దంచుతున్నాను. ఆ ఉపన్యాసాలు నిర్విఘ్నంగా కొనసాగాలని రాబోయే వినాయక చవితికి విఘ్నేశ్వర పూజ కూడ చేస్తున్నాను!"